క్లుప్తంగా

అనుమతి లేని భవనం అంతస్తుల ధ్వంసం



అనధికార అంతస్తులను ధ్వంసం చేస్తున్న పంచాయతీ కూలీలు

రావులపాలెం: స్థానిక శెట్టిబలిజనగర్‌లో ఇటీవల నిర్మించిన ఒక బిల్డింగ్‌పై అంతస్తులను సోమవారం పంచాయతీ అధికారులు ధ్వంసం చేశారు. దీనిపై పంచాయతీ సెక్రెటరీ ఎల్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో బిల్డింగ్ దారుడు అనుమతి పొందిన దాని కంటే ఎక్కువ అంతస్తులు నిర్మించడంతో కోర్టు ఉత్తర్వులు నేపథ్యంలో అనధికార అంతస్తులను ధ్వంసం చేసినట్టు తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత దంపతులకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న సత్యమూర్తి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమగోదావరి జిల్లా ఆచంటకు చెందిన నక్కింటి వెంకటరావు, అంజలీదేవి దంపతులు సోమవారం రూ.15 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ విరాళాన్ని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తికి అందజేశారు. విరాళం అందించిన వెంకటరావు దంపతులకు అర్చకులు స్వామి వారి వేద ఆశీర్వచనం అందించారు. స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు. దాత దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులను ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు అభినందించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న పశు వైద్యాధికారులు, సిబ్బంది

ఆలమూరు: స్థానిక పశుసంవర్ధకశాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లో సోమవారం గాలికుంటు వ్యాధి టీకాల ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలోని పినపళ్లలో పశువైద్యాధికారి సుభాష్, వీఎల్ఓ ఈదల శ్రీనివాసు నేతృత్వంలో ప్రారంభమైన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ఏడీ ఎల్.అనిత ప్రారంభించారు. ఈ ఏడాదిలో తొలి విడతగా నిర్వహించిన గాలికుంటు వ్యాధి టీకాలను పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. స్థానిక జేవీఓ శ్రీనివాసు ఆధ్వర్యంలో గ్రామంలోని 252 పశువులన్నింటికీ ఈ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువైద్య సిబ్బంది అందజేశారు. గ్రామ పశుసంవర్ధకశాఖ సహాయకులు జి.మహేష్ దుర్గా ప్రసాద్, రాంబాబు, ప్రకాష్ పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపుపై విచారణ



మోరిపోడులో డ్రెయిన్ మట్టి తరలించిన ఏరియా గట్లను పరిశీలిస్తున్న రేష్మ

మలికిపురం: అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండా డ్రెయిన్ మట్టిని శ్మశానం ఎత్తు పేరుతో ప్రైవేటు వ్యక్తుల భూముల పూడ్చేందుకు అమ్మకాలు సాగించారన్న అందిన ఫిర్యాదుపై సోమవారం సదరు శాఖ రాజోలు ఏఈ భూపతి రేష్మ విచారణ చేపట్టారు. విశ్వేశ్వరాయపురం వంతెన వద్ద నుంచి మోరిపోడు సరిహద్దు వరకూ వేపచెట్టు డ్రెయిన్ పూడికతీత పనులు రూ.47 లక్షలతో చేపట్టారు. ఈ క్రమంలో డ్రెయిన్ మట్టిని కొంత మంది వ్యక్తులు ప్రైవేటు వ్యక్తుల భూముల మెరక చేసేందుకు తరలించినట్టు ఆ ఫిర్యాదులో యెనుముల వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, ముత్యాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రేష్మ, డ్రెయిన్ గట్లును, ప్రైవేటు వ్యక్తుల భూమి మెరక చేసిన ప్రాంతాలను పరిశీలించారు.

రికార్డుల పరిశీలన

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలోని జొన్నాడలో రికార్డుల పరిశీలన జరిగింది. వైద్యాధికారి డి.సాయికిషోర్ ఆదేశాల మేరకు హెల్త్ విజిటర్ పి.ఉమ సోమవారం గ్రామ సచివాలయం–1కు చెందిన హెల్త్ క్లినిక్‌కు వెళ్లి రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య, ఆశ సిబ్బంది అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు టీకాలను నిర్ణీత సమయంలో ఇవ్వాలని, గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డెక్కితే బాదుడే..

- రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు
- అమలులోకి వచ్చిన నూతన మోటారు వాహన చట్టం
- హెల్మెట్ ధరించకుంటే ఇక నుంచి రూ.1000 కట్టాల్సిందే



జొన్నాడలోని 216 ఏ జాతీయ రహదారిలో నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

ఆలమూరు: రోడ్డెక్కితే ఇప్పటి వరకూ ఒక బాదుడు ఉంటే.., ఇక నుంచి మరో బాదుడు ప్రారంభమైంది. రహదారిపై ఏ విధమైన నిబంధనలు ఉల్లంఘించినా భారీ జరిమానాలు కట్టవలసిందే. రెండోసారి పట్టుబడితే ఆ జరిమానాలు సుమారు పదింతలవుతుంది. దీంతో సగటు వాహనదారుడు ప్రయాణించేటప్పుడు ఏ మాత్రం జాగ్రత్తలు తీసుకోకపోయినా జేబులు గుల్లవ్వడం ఖాయంగా కనిపిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈనెల ఒకటి నుంచి నూతన మోటారు వాహన చట్టం అమలులోకి వచ్చింది. రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ స్థాయి బాదుడు తప్పదని చెబుతుంది. ఇప్పటికే గత నెల రోజుల నుంచి రవాణాశాఖ అధికారులు రహదారి ఉల్లంఘనలు–జరిమానా చెల్లింపులపై విస్తృత ప్రచారం నిర్వహించింది. హెల్మెట్ ధరించకుంటే సంభవించే ప్రమాదాలను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. ప్రస్తుతం రవాణాశాఖ అధికారులు నగరాల్లో అమలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇక నుంచి పట్టణాలు, పల్లె ప్రాంతాల్లో అమలు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు.

మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులదే బాధ్యత

రహదారులపై మైనర్లు లైసెన్స్ లేకుండా వాహనాలు

నిబంధనలు	జరిమానా నాడు రూ.	జరిమానా నేడు రూ.	రెండవసారి ఉల్లంఘిస్తేరూ.
హెల్మెట్ ధరించకుంటే	100	1000	1000
లైసెన్స్ లేకుండా డ్రైవింగ్	500	10000	10000
రిజిస్ట్రేషన్ లేని వాహనం	1000	5000 (వరకూ)	8000 (వరకూ)
శబ్ద కాలుష్యం	---	1000	2000
మైనర్ డ్రైవింగ్	---	5000	5000
రేసింగ్	500	5000	10000
సెల్‌ఫోన్ డ్రైవింగ్	1000	1500	10000
ట్రిపుల్ డ్రైవింగ్	500	1500	10000
ఆటోడ్రైవర్‌కు డ్రెస్ లేకుంటే	100	200	200

నడిపితే సంబంధిత యువకుల తల్లిదండ్రులే బాధ్యత వహించాలని నూతన చట్టం చెబుతుంది. డ్రైవింగ్‌పై సరైన అవగాహన లేకుండా వాహనాలు నడిపితే సంభవించే ప్రమాదాలపై రవాణాశాఖ తమ ప్రచారాన్ని విస్తృతం చేసింది. అందులో భాగంగా ప్రతి హైస్కూల్, కళాశాలల్లో దశల వారీగా విద్యార్థులకు రవాణా శాఖ నిబంధనలపై అవగాహన సదస్సులను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నిబంధనలు ఉలంఘిస్తే జరిమానా



నూతన మోటారు వాహన చట్ట ప్రకారం రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు కట్టాల్సిందే. ప్రతి వాహనదారుడు రోడ్డుపైకి వచ్చేటప్పుడు అన్ని డాక్యుమెంట్లతో పాటు కచ్చితంగా హెల్మెట్ ధరించాలి. ఒకసారి పట్టుబడితే ఒక విధంగా జరిమానా విధిస్తుండగా మరోసారి పట్టుబడితే ఆ జరిమానా మరింత కఠినంగా ఉంటుంది.

– ఎం.అశోక్, ఎస్సై, ఆలమూరు

బాల కార్మికులతో పని చేయిస్తే చర్యలు



సఖినేటిపల్లి మూడు తూములు సెంటర్ వ్యాపార సంస్థలో తనిఖీ చేస్తున్న శివ నాగమల్లేశ్వరావు

సఖినేటిపల్లి: 18 ఏళ్ల లోపు బాలబాలికలను పనిలో పెట్టుకుంటే బాల కార్మిక చట్టం ప్రకారం జైలు శిక్ష, జరిమానాకు గురవుతారని కార్మిక శాఖ సహాయ అధికారి కె.శివనాగమల్లేశ్వరరావు అన్నారు. సోమవారం సఖినేటిపల్లి మూడు తూములు సెంటర్లో వ్యాపార సంస్థల్లో బాల కార్మికులను గుర్తించడానికి కార్మిక, పోలీస్, ఐసీడీఎస్, అంగన్‌వాడీ, విద్యాశాఖ సిబ్బందిలతో నాగ మల్లేశ్వరరావు తనిఖీలు నిర్వహించారు.

పిల్లలు అందరూ తప్పక చదువుకోవాలని, పనికి అనుమతించవద్దని ఆయన వ్యాపారస్తులకు హితవు పలికారు. వెంట స్థానిక పీఎస్ కానిస్టేబుల్ ఎం.హర్షవర్ధన్, విద్యాశాఖ సిబ్బంది బి.కిషోర్ కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.పూజిత, ఎస్.సుమ పాల్గొన్నారు.

నిత్య సహాయమాత స్వరూపం ఆవిష్కరణ

అంబాజీపేట: పుల్లేటికుర్రు నల్లావారిపేటలో కత్తుల సత్యనారాయణ, లక్ష్మి దంపతులు ఏర్పాటు చేసిన నిత్య సహాయమాత స్వరూపాన్ని రెవ.ఫాదర్ వినయ్ సాగర్ సోమవారం ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్ నూకపెయ్యి చిన్న ఆధ్వర్యంలో సర్పంచ్ జల్లి బాల రాజు అధ్యక్షతన సహాయమాత స్వరూపాన్ని ప్రారంభించారు. ఎంపీటీసీ కత్తుల బాలరాజు, వార్డు సభ్యులతో పాటు సంఘ పెద్దలను ఘనంగా సత్కరించారు.

ప్రశాంతంగా సెకండియర్ పరీక్షలు

అంబాజీపేట: పుల్లేటికుర్రు ఏవీఎస్ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన ఇంటర్మీడియెట్ సెకండియర్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తెలుగు పరీక్షకు జనరల్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 241 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 224 మంది హాజరు కాగా 17 మంది గైర్హాజరయ్యారని డిపార్ట్‌మెంటల్ అధికారి చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు.

టీడీపీ నుంచి సర్పంచ్‌ను సస్పెండ్ చేయాలి

అంబాజీపేట: టీడీపీ పార్టీకి వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న సర్పంచ్ జల్లి బాలరాజును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని గ్రామ శాఖ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. పుల్లేటికుర్రులో పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ కో కన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ ఇంటి ఆవరణలో పార్టీ అధ్యక్షుడు పబ్బినీడి రాంబాబు అధ్యక్షతన పార్టీ గ్రామ సమావేశం సోమవారం నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయకుండా వ్యతిరేకంగా పనిచేశాడని పార్టీ నాయకులు తెలిపారు. గత పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ నుంచి బాలరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించామని, గత మూడేళ్లుగా పార్టీకి పనిచేయకుండా వ్యతిరేకంగా పనిచేస్తూ నాయకులను, కార్యకర్తలను దూషిస్తున్నాడన్నారు. పార్టీకి నష్టం కలిగిస్తున్న సర్పంచ్ బాలరాజును పార్టీ నుంచి తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు రాంబాబు, వీరవెంకట సత్యనారాయణ, దొమ్మేటి సురేష్, కాసా నాగ మల్లేశ్వరరావు పలువురు తెలిపారు. ఈ మేరకు తీర్మాన కాపీలను సీఎం చంద్రబాబునాయుడు, పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌లతో పాటు ఇతర నాయకులకు పంపనున్నామన్నారు.

జాతీయ రహదారి పనులు వెంటనే ప్రారంభించాలి



కేంద్రమంత్రి వర్మకు సమస్యలు వివరిస్తున్న బీజేపీ నాయకులు

మలికిపురం: నర్సాపురం దగ్గరలోని సీతారామపురం నుంచి రామేశ్వరం–రాజుల్లంక మీదుగా దిండి వరకూ జాతీయ రహదారి బైపాస్ పనులు వెంటనే ప్రారంభించాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మకు రాజోలు నియోజకవర్గ బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పర్యటనలో భాగంగా మలికిపురం మండలం ఆధ్వర్యంలో చించినాడ బ్రిడ్జి వద్దకు వచ్చిన మంత్రికి కోనసీమ జిల్లా బీజేపీ శ్రేణులు ఆయనను దుశ్శాలువతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమ, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, మలికిపురం మండల బీజేపీ అధ్యక్షుడు మేడిచర్ల చాణక్య, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చెల్లింగి త్రినాథ్, కంచి నాగేశ్వరరావు, కట్టా వాసు, అనిశెట్టి బాలాజీ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. నియోజకవర్గం మీదుగా జరగాల్సిన రైల్వే, జాతీయ రహదారి పనులు పూర్తి చేయాలని కోరారు.

ప్రమాద బాధితురాలికి సాయం



బాధితురాలికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదంలో గాయపడిన బాధితురాలికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు సోమవారం రూ.13 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కందిబోయిన తలుపులమ్మ (40) గోపాలపురం పంచాయతీలో స్వీపర్‌గా పని చేస్తుంది. నెలరోజుల క్రితం పనిలో ఉండగా పంచాయతీ ట్రాక్టర్‌పై నుంచి పక్కకి పడిపోవడంతో ట్రాక్టర్ ఈవిడ నడుము మీద నుంచి వెళ్లిపోయింది. ఇప్పటి వరకు దాతలు చేసిన సహాయంతో వైద్యం చేయించారు. 4 నెలల వరకు మంచం మీదే విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు చెప్పారు. వైద్యానికి మందులకు ఆర్థికస్తోమత లేక ఆమె భర్త దొరబాబు కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో రావులపాలెంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న తలుపులమ్మ ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.13 వేలు చెక్కును సాయంగా అందించారు.

నూకాంబికా అమ్మవారికి గ్రామోత్సవం

ఆలమూరు: మండలంలోని పినపళ్లలో నూకాంబిక అమ్మవారికి సోమవారం వైభవంగా గ్రామోత్సవం జరిగింది. చింతలూరులో వేంచేసిన గ్రామదేవత నూకాంబిక అమ్మవారు చర్మ వాయిద్యాల నడుమ బుట్టగరగ రూపంలో మూడో రోజు గ్రామంలో ఇంటింటికీ దర్శనమిచ్చింది. బుట్టగరగను నెత్తిన ధరించిన ఆలయ అర్చకుల పాదాలను మహిళ భక్తులు పసుపు నీళ్లతో కడిగి నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమలను అందజేశారు. మొక్కులు తీర్చుకుని హారతులు పట్టి తీర్థ ప్రసాదాలు సమర్పించారు. ఈనెల 13 వరకూ మండలంలోని వివిధ గ్రామాల్లో రోజుల పాటు అమ్మవారు బుట్టగరగ రూపంలో దర్శనమివ్వనున్నట్లు ఈఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి తెలిపారు.

మహిళల జీవితాల్లో వెలుగులు నింపాలి



పినపళ్లలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఆలమూరు: నేటి సమాజంలో మహిళలకు అన్ని విధాలుగా ప్రోత్సహించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో గ్రామ సచివాలయం, ఆరోగ్య, ఆశ సిబ్బంది పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలను అన్ని రంగాల్లో రాణించాలి అంటూ నినాదాలు చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పలుచోట్ల మొక్కలు నాటారు. సూపర్‌వైజర్లు టీఎస్‌వీ నాగలక్ష్మి, వై.అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

కంకరగుట్ట ఎక్కి బోల్తా కొట్టిన కారు



అంతర్వేది కొత్తవంతెన వద్ద బోల్తా కొట్టిన కారు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలో ఆదివారం రాత్రి వేగంగా వెళుతున్న కారు ఒకటి రోడ్డు పక్కన ఉన్న కంకర గుట్ట ఎక్కి బోల్తా కొట్టింది. కొత్త వంతెన వద్ద బోల్తా కొట్టిన కారు అంతర్వేది చానల్ వైపు ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. స్వల్పగాయాలతో బయటపడిన కారు యజమాని రవి కుమార్‌ను చికిత్స నిమిత్తం హుటాహుటిన స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే విద్యుత్ స్తంభం ఢీకొట్టిన ఘటనలో కూడా ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై పోలీసులను సోమవారం వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ మామిడికుదురు మండల కార్యకర్తల సమావేశం మంగళవారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము తెలిపారు. పెదపట్నంలంకలో జరిగే ఈ సమావేశానికి పి.గన్నవరం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు హాజరవుతారని చెప్పారు. పార్టీ శ్రేణులంతా విధిగా సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

నేటి నుంచి సప్తాహం

మామిడికుదురు: పెదపట్నంలంక బొక్కావారిపాలెంలో మంగళవారం నుంచి సీతాసమేత పట్టాభిరామ అఖండ శ్రీరామనామ సర్వనామ షష్టమ సప్తాహం జరుగుతుందని ఆలయ కమిటీ సోమవారం తెలిపింది. అశ్విని నక్షత్ర యుక్త కుంభ లగ్నంలో ఉదయం 6.25 గంటలకు కంచి నీలకంఠగురుమూర్తి, నాగలక్ష్మి దంపతుల కలశ స్థాపనతో ఉత్సవం ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 11వ తేదీ వరకు ఈ సప్తాహం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా నిరంతరాయంగా శ్రీరామ నామ సర్వనామ కీర్తనలతో భజన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

మృతుని కుటుంబానికి రూ.ఐదు లక్షల పరిహారం

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో గత ఏడాది విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ముచ్చారి వీర్రాజు (40) కుటుంబానికి పరిహారం అందించాలంటూ లోకాయుక్త సోమవారం తీర్పును వెలువరించింది. వివరాల్లోకి వెళితే గత ఏడాది ఆగస్టు 16న స్థానిక పంట కాలువగట్టుపై పచ్చగడ్డి కోస్తుండగా ప్రమాదవశాత్తూ 33 కేవీ విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన సామాజికవేత్త జంపాన శ్రీనివాసగౌడ్ ప్రచార మాధ్యమాల్లో వచ్చిన వార్తలకు స్పందించి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి వాదోపవాదాలు జరుగుతుండగా మృతుడు వీర్రాజు కుటుంబానికి రూ.ఐదు లక్షల పరిహారం అందించాలని కోరుతూ రాష్ట్ర లోకాయుక్త పి.లక్ష్మణరెడ్డి తుది తీర్పు వెలువరించారు. దీంతో ఆ ఉత్తర్వుల మేరకు విశాఖపట్నానికి చెందిన ఏపీఈఆర్‌సీ ఆదేశాల మేరకు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎండీ వి.విజయలలిత పరిహారాన్ని మంజూరు చేస్తూ ఉత్తర్వులను వెలువరించినట్లు సామాజికవేత్త శ్రీనివాస్ గౌడ్ సోమవారం విలేకరులకు తెలిపారు. అలాగే పరిహారం సొమ్మును గత నెల 19న మృతుడి భార్య మమతకు చెందిన బ్యాంకు ఖాతాలో జమ అయిందని ఆయన పేర్కొన్నారు.

సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

అయినవిల్లి: మండలంలోని నేదునూరు పెదపేటలో సీతారామచంద్రస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను సోమవారం వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. స్వామి వారి విగ్రహాన్ని వేదమంత్రాల ఉచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ ప్రతిష్ఠ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భారీ అన్నసమారాధన ఏర్పాటు చేవారు. గ్రామ సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ స్వామిని దర్శించి పూజలు చేశారు.

బాలయోగి వర్ధంతి

మలికిపురం: భారత లోక్‌సభ మాజీ స్పీకర్, దివంగత నేత జీఎంసీ బాలయోగి వర్ధంతిని మలికిపురంలో సోమవారం నిర్వహించారు. మలికిపురంలో బాలయోగి విగ్రహానికి ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పాశర్లపూడిలో..

మామిడికుదురు: కోనసీమ అభివృద్ధి కోసం అహరహం శ్రమించిన లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి చిరస్మరణీయుడని జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు శ్లాఘించారు. బాలయోగి వర్ధంతిని పురస్కరించుకుని పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్లో ఉన్న విగ్రహానికి టీడీపీ నేతలు సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: దివంగత మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి సేవలు అజరామరమని జీఎంసీ బాలయోగి చారిటబుల్ సొసైటీ జిల్లా కన్వీనర్ గిడ్ల వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక కె.జగన్నాథపురం ఉమామహేశ్వర ఉన్నత పాఠశాల ఆవరణలో మోర్త సత్తిబాబు అధ్యక్షతన బాలయోగి వర్ధంతి నిర్వహించారు.

ఈ సందర్భంగా బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ అధ్యక్షులు అంకం నాగమల్లేశ్వరరావు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొని నివాళులర్పించారు.

రాజోలులో..

రాజోలు: లోక్‌సభ మాజీ స్పీకర్ బాలయోగి ఆదర్శనీయుడని ఎంపీపీ కేతా శ్రీనివాస్ అన్నారు. సోమవారం బాలయోగి వర్ధంతి పురస్కరించుకుని రాజోలు కాటన్ పార్కులోని బాలయోగి విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వెంకన్న కల్యాణోత్సవాలకు రాట ముహూర్తం

అమలాపురం టౌన్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఏప్రిల్ 7వ తేదీన జరగనున్న స్వామివారి కల్యాణోత్సవాలకు సంబంధించి పందిరి రాట ముహూర్తం సోమవారం శాస్త్రోక్తంగా జరిగింది. దేవస్థానంలో ప్రాంగణంలో ఉదయం 9.49 గంటలకు భక్తులు, పుర ప్రజలు, అర్చకుల సమక్షంలో పందిరిరాటను వేసి పూజలు చేశారు. దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్ గండి హారిక, అర్చకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పందిరిరాట ముహూర్తం అయ్యాక అక్కడే అర్చకులు పూజలు చేశారు.

అప్పు తీర్చమంటోందన్న అక్కసుతో మహిళపై దాడి

అమలాపురం టౌన్: భర్త నుంచి విడాకులు తీసుకుని బతుకుతున్న ఓ మహిళ మరిది తీసుకున్న అప్పు తిరిగి అడిగినందుకు మొత్తం కుటుంబ సభ్యులంతా ఒక్కటై ఆమెపై దాడికి దిగారు. బాధిత మహిళ పోలాబత్తుల లలితాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ పి.వీరబాబు కేసు నమోదు చేశారు. దీనిపై పట్టణ ఎస్సై తల్లిబోయిన శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... విడాకులు తీసుకుని స్థానిక గొవ్వాలవారి వీధిలో నివసిస్తున్న లలితాదేవి గతంలో తన మరిది పోలాబత్తుల సత్య విష్ణుకు రూ.3.30 లక్షల అప్పు ఇచ్చింది. మూడు నెలల కిందట తన కుమార్తెకు పెళ్లి చేసిన లలితాదేవి అప్పటి నుంచి తన అప్పు తీర్చమని మరిదిని కోరింది. నీ కుమార్తె పెళ్లికి తాను రూ.1.50 లక్షలు దాకా ఖర్చు చేశానని, ఇప్పుడు అప్పు తీర్చలేనని మరిది సత్యవిష్ణు తెగేసి చెప్పాడు. అప్పు తీర్చమని లలితాదేవి ఒత్తిడి చేస్తుండడంతో ఆమెపై అక్కసు పెంచుకున్న మరిది సత్య విష్ణు, ఆమె భర్త సుబ్బారాయుడు, మరో మరిది సురేష్, వారి తల్లి, ఇతర కుటుంబ సభ్యులు గత నెల 28న మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారు. ఈ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

సంపద లేదు.. చెత్త సేకరణ లేదు...

- మొక్కుబడిగా చెత్త సేకరణ
- నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు
- పలు గ్రామాల్లో గుట్టలుగా చెత్త
- తడి, పొడి చెత్తను సేకరించేందుకు కూలీల కొరత
- రూ.కోట్ల ప్రభుత్వాదాయం వృథా



ఎస్.మూలపాలెంలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తీసే కేంద్రం



మండలంలోని పంటకాలువల వెంబడి పేరుకుపోతున్న చెత్త

అయినవిల్లి: చెత్త నుంచి సంపద సృష్టించాలనే ఆలోచనతో గత టీడీపీ ప్రభుత్వం ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డులు నిర్మించింది. తడి, పొడి చెత్తను సేకరించి ఎరువుగా తయారు చేసి సంపద సమకూర్చుకోవచ్చని చేసిన అప్పటి ప్రభుత్వ ప్రయత్నం పూర్తిగా విఫలమైంది. విధి విధానాలు లేకుండా ప్రభుత్వం చేపడుతున్న పనుల వల్ల కోట్లాది రూపాయల ప్రజా ధనం వృథా అవ్వడమే కాకుండా నిర్మించిన యార్డు షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో ఎక్కడిచెత్త అక్కడ వేయకుండా ఒక్క చోటకు చేర్చి తద్వారా చెత్త నుంచి సంపద తీసుకురావాలనే ఆలోచన బాగానే ఉన్నా అది క్షేత్ర స్థాయిలో ఎంతవరకు సాధ్యమవుతుందో పట్టించుకోకుండా నిధులు ఖర్చు చేసేశారు.

ఎక్కడి చెత్త అక్కడే..

గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. కొన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డులు నిర్మించినప్పటికీ రోడ్డు పైనే చెత్త పేరుకుపోతుంది. గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల కొరత ఉండటం వల్ల వ్యర్థాలను తొలగించే పని చేపట్టలేకపోతున్నారు.

చెత్త సేకరించి సంపద తేవడం దేవుడెరుగు ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోయి దోమలు పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాజకీయ నాయకులు నిధులు సమకూర్చి పనులు చేశామని చెప్పుకోవడమే తప్ప అవి ప్రజలకు ఉపయోగపడటం లేదు. ఆ నిధిని వేరే పనులకు ఉపయోగిస్తే పేదలకు మేలు జరిగేదని పలువురు పేర్కొంటున్నారు.

లక్షల్లో నిధులు కేటాయింపు

నియోజకవర్గంలో అయినవిల్లి, అంబాజీపేట, మామిడికుదురు, పి.గన్నవరం 68 గ్రామ పంచాయతీలున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు అన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డులు నిర్మించారు. గ్రామాల్లో ఒక్కో డంపింగ్ యార్డుకు పంచాయతీ, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.లక్షల్లో నిధులు కేటాయించారు. ఈ లెక్కన సుమారుగా నియోజకవర్గంలో రూ.కోట్లలో నిధులు వెచ్చించారు. నిధులు దుర్వినియోగం తప్ప ప్రజలకు ఒరిగిందేమి లేదు. అదే విధంగా చెత్త సేకరించేందుకు వాహనాలు కూడా సమకూర్చలేకపోయారు.

చెత్త పేరుకుపోతుంది



పంచాయతీల్లో పారిశుధ్య సిబ్బంది లేక ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతుంది. గ్రామ ముఖ్య కూడలిలో రోడ్ల పక్కన పంట కాలువల పక్కన చెత్త డంపింగ్ చేస్తున్నారు. దీనివల్ల అపారిశుధ్యం పేరుకుపోయి దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. చెత్త నుంచి సంపద తీసే కేంద్రం కూడా గుర్తొచ్చి నప్పుడు చెత్త సేకరణ చేస్తున్నారు. పూర్తి స్థాయిలో వినియోగంలోకి ఈ కేంద్రం రాలేదు.

– యండమూరి బ్రహ్మానందం, ఎస్.మూలపాలెం